పోలీస్ సేవలపై ప్రజాభిప్రాయం తెలిపేందుకు క్యూఆర్ కోడ్

● ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

సూర్యాపేట టౌన్, జనవరి 9: పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయం తెలిపేందుకు ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఏఎస్పీ నాగేశ్వర్ రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్యతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో పోలీసుల సేవలపై ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి అభిప్రాయాలు సేకరించేవారని, ప్రస్తుతం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ-చలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లకు రేటింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఈ క్యూఆర్ కోడ్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఐటీ కోడ్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు

నాగారం: నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఐలయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, కానిస్టేబుల్ లావణ్య పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురికి రిమాండ్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

చివ్వెంల, జనవరి 9: మండలంలోని లక్ష్మీనాయక్ తండాలో ఈ నెల ఒకటో తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను రిమాండ్ చేసినట్లు డీఎస్పీ రవి తెలిపారు. గురువారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. లక్ష్మీనాయక్ తండాకు చెందిన బానోతు శేషు, ధరావత్ వెంకన్న, బానోతు శ్రీను (ఏఆర్ పోలీసు)కు గత కొంతకాలంగా భూమి గెట్టు పంచాయితీ నడుస్తోంది. ఈ విషయమై 2017లో గొడవలు జరిగి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. దీంతో గత కొంతకాలంగా ధరావత్ వెంకన్న కుమారుడు దీపక్, అతని కుటుంబ సభ్యులు శేషును చంపేందుకు చూస్తున్నారు. ఈ క్రమంలో గత డిసెంబర్ 31న రాత్రి సుమారు 12 గంటల తర్వాత శేషు సూర్యాపేటలో తన పనులు ముగించుకొని బైక్‌పై తండా శివారులోని కాల్వ వద్దకు చేరుకోగా.. అక్కడ దీపక్, అతని స్నేహితులు ధరావత్ రాజేశ్, ధరావత్ సురేశ్, జర్పుల ప్రవీణ్ మద్యం తాగుతూ అరుస్తుండటంతో వారి వద్దకు వెళ్లాడు. దీంతో దీపక్ పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని తన బైక్‌లో ఉన్న కత్తిని తీసి శేషును పొడవగా అక్కడే ఉన్న రాజేశ్, సురేశ్, ప్రవీణ్ పారిపోయారు. వెంటనే దీపక్ తన తండ్రి వెంకన్న, తల్లి సుజాతను పిలిచాడు. ముగ్గురు కలిసి శేషుపై దాడి చేస్తుండగా అక్కడి నుంచి పరుగులు తీసి తండాలోని వాంకుడోత్ రంగా ఇంటి వెనుక ఉన్న గుడిసెలో దాక్కున్నాడు. అయినా శేషును వెంబడించి కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడిచి హత్య చేశారు. శేషు భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ఆత్మకూర్.ఎస్ మండలం కోటినాయక్ తండాలోని బంధువుల ఇంట్లో ఉన్నారని పోలీసులకు సమాచారం అందడంతో గురువారం అరెస్ట్ చేశారు. నిందితులు దీపక్, వెంకన్న,సుజాత, రాజేశ్ అలియాస్ రాజశేఖర్, సురేశ్, ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా, హత్యకు సహకరించినట్లుగా భావిస్తున్న బానోతు శ్రీను పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఇద్దరికి యావజ్జీవ శిక్ష

కోదాడ రూరల్, జనవరి 9: కోదాడలో 2017లో జరిగిన ఓ హత్య కేసులో నిందితులకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. కోదాడలోని హెచ్ఆర్ స్కూల్ సమీపంలో ఉండే గండు వంశీ, అతని భార్య దుర్గ కలిసి ఏపీలోని కృష్ణా జిల్లా వత్సవాయి మండలం వేముల గ్రామానికి చెందిన మాధవిని తమ ఇంట్లో హత్య చేశారు. మాధవి భర్త సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రజితారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కేసుకు సంబంధించి 14 మంది సాక్షులను విచారించారు. ఈ మేరకు గురువారం కోదాడ ప్రిన్సిపల్ జడ్జి గోవర్ధన్‌రెడ్డి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, పట్టణ సీఐ రాము తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

నాగారం, జనవరి 9: మండల పరిధిలోని పసునూరు మోడల్ స్కూల్‌లో చదువుతున్న హాస్టల్ విద్యార్థినులకు స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు, కేజీబీవీ ఎస్ఓ షిరిన్, శ్రీనివాస్, కేర్ టేకర్ లత, ఉపాధ్యాయులు వేముల బాలరాజు, సోమసుందర్, విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి'

నడిగూడెం, జనవరి 9: విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధించొచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకుడు నారాయణ లక్ష్మీనరసింహాచారి అన్నారు. గురువారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'ఒత్తిడిని ఎలా జయించాలి' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయనాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిక హాస్టల్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

కోదాడ టౌన్, జనవరి 9: కోదాడలోని పెరిక హాస్టల్ నూతన కార్యవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడు హసనాబాద రాజేశ్, గౌరవాధ్యక్షుడు పాయిలి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుందరి వెంకటేశ్వర్లు, కోశాధికారి గుండు అనురాధ, ఉపాధ్యక్షులు ముత్తినేని కోటేశ్వరరావు, దొంగరి సత్యనారాయణ, కందుల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు, వనం నాగేశ్వరరావుతో పాటు సభ్యులు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జునతో పాటు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 9: మండల పరిధిలోని లింగగిరి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు గూడెపు నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి లీలావతి గురువారం రూ.10 వేల విలువైన సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు నజీమ అంజూమ్, ఇందిరాల జ్యోతి, బి.చందు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, MOHAMMAD ABDUL SALEEM, S/o. Abdul Hussain, R/o. H.No.4-329, Vidyanagar Colony, Thripuraram, Village & Mandal, Nalgonda District, I have changed my name as MOHAMMED ABDUL SALEEM (New Name).

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
మరిన్ని వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులి: 9182777638

సదరం సర్టిఫికెట్ల జారీలో పొరపాట్లకు తావివ్వద్దు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సదరం క్యాంపుల నిర్వహణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సూర్యాపేట, జనవరి 9: సదరం క్యాంపుల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీలో పొరపాట్లకు తావివ్వద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో సదరం క్యాంపుల నిర్వహణపై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిల హెచ్ఓడీలు, డీఆర్‌డీఏ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల జారీలో పొరపాటు జరిగితే ఆ రోజు విధులు నిర్వహించే వైద్యుడిదే పూర్తి బాధ్యత అన్నారు. డిసెంబర్‌లో 345 స్లాట్స్ బుకింగ్ కాగా 216 మందిని అర్హులుగా గుర్తించి 124 మందికి సర్టిఫికెట్స్ అందించామని, మిగిలిన వారికి సర్టిఫికెట్స్ ఇవ్వలేకపోయామని చెప్పడంతో అందుకు గల కారణాలు తెలపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

హెచ్ఓడీలతో ప్రత్యేక సమావేశం..

జనరల్ ఆసుపత్రిలోని సర్జన్, రేడియాలజీ, అనస్థీషియా, ఆర్థోపెడిక్, కంటి, ప్రసూతి, పీడియాట్రిక్ విభాగాల అధిపతులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సమస్యలను, ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నెలలో 345 మందికి ప్రసవాలు చేయగా, అందులో 208 నార్మల్ డెలివరీలు, 137 సిజేరియన్ చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి కావాల్సిన పరికరాల వివరాలు, వాటి అంచనాలను సిద్ధం చేసి తీసుకురావాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

జనరల్ ఆసుపత్రి సందర్శన..

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిని గురువారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. వైద్య సేవల వివరాలను అడిగి తెలుకున్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన డీఏఓ

ఆత్మకూర్.ఎస్, జనవరి 9: మండల కేంద్రంతో పాటు మండలంలోని నెమ్మికల్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా పలు గ్రామాల్లో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు. మండలంలో ఎలాంటి ఎరువుల కొరత లేదని డీఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : డీఐఈఓ భానునాయక్

మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

నేరేడుచర్ల, జనవరి 9: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని డీఐఈఓ భానునాయక్ అన్నారు. గురువారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులపై అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య 90 రోజుల ప్రణాళికను తయారు చేశారని, దీనికి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, ప్రణతి, నర్సింహారావు, లైబ్రేరియన్ జానకిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి : సీఐ రాము

కోదాడ టౌన్, జనవరి 9: రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు సంభవించవని పట్టణ సీఐ రాము పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తి అరెస్ట్

సూర్యాపేట టౌన్, జనవరి 9: గంజాయితో పట్టుబడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట ఎక్సైజ్ శాఖ సీఐ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.లక్ష్మానాయక్ ఆదేశాల మేరకు సూర్యాపేటలోని హైటెక్ బస్టాండ్ పరిసరాల్లో గురువారం ఎక్సైజ్ శాఖ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన బీహార్ రాష్ట్రంలోని పాట్నాకు చెందిన వలస కూలీ పప్పు రేను తనిఖీ చేయగా 175 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సురేందర్ బెనర్జీ, సిబ్బంది గఫూర్, నజీర్, శ్రీను, వనజ, క్రాంతి, మోయిన్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని పల్లె దవాఖాన సిబ్బంది

● వైద్యం అందడం లేదని ప్రజల ఆవేదన

గురువారం మూసి ఉన్న పల్లె దవాఖాన

పాలకవీడు, జనవరి 9: మండల పరిధి కల్మటితండాలోని పల్లె దవాఖాన సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతో తమకు వైద్యం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని, వైద్యం కోసం వెళ్తే దవాఖాన మూసి ఉంటోందని వాపోతున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, దీనిపై మండల వైద్యాధికారి నాగిని వివరణ కోరగా.. సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కచ్చితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధుల్లో నిరక్ష్యం వహించే వారికి మెమో అందజేస్తామని పేర్కొన్నారు.

ఫణిగిరిని సందర్శించిన బౌద్ధ భిక్షువులు

బౌద్ధ క్షేత్రం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

నాగారం, జనవరి 9: మండల పరిధి ఫణిగిరి గ్రామంలోని బౌద్ధ క్షేత్రాన్ని, మ్యూజియాన్ని బౌద్ధ భిక్షువులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ క్షేత్రం విశేషాలను తెలుసుకున్నారు. సందర్శించిన వారిలో బౌద్ధ భిక్షువులు పూజ్య గురు బెహన్, తేజీ దమ్మ రత్న, బెహన్ తేజీ బౌద్ధ పాల, బెహన్ తేజీ కల్యాణ్, సిరి బెహన్ తేజీ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోదాడ రూరల్, జనవరి 9: కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ఎండీ. సలీంషరీఫ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం దేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి ఎంఈఓ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, జనవరి 9: మండలంలోని కల్మల్‌చెర్వు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో టౌన్ ఫీడర్ పరిధిలో11 కేవీ విద్యుత్ స్తంభాల మార్పు పనులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గన్న సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిడేపల్లిలో అంతరాయం ఉంటుందన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కోదాడ రూరల్, జనవరి 9: దోరకుంట గ్రామంలో దాసరి లింగస్వామికి చెందిన గొర్రెల మందపై బుధవారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. లింగస్వామిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గణిత టాలెంట్ టెస్ట్

తిరుమలగిరి, జనవరి 9: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.ఎంఈఓ శాంతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

నాగారం, జనవరి 9: మండల కేంద్రంలో క్రాంతి యువజన సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను డీఎస్పీ రవి గురువారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, కూరం వెంకన్న, క్రాంతి యువజన సంఘం వ్యవస్థాపకుడు చిప్పలపల్లి విక్రమ్, అధ్యక్షుడు చిప్పలపల్లి చిరంజీవి, నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య పాల్గొన్నారు.

స్థల పరిశీలన

మద్దిరాల, జనవరి 9: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం తాసీల్దార్ అమీన్‌సింగ్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తాసీల్దార్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

గరిడేపల్లి, జనవరి 9: మండలంలోని శీత్లా తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుగులోతు మగతానాయక్ గురువారం అనారోగ్యంతో మృతిచెందగా, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ కుక్కునూరు అంజయ్య, సత్యనారాయణరెడ్డి, దస్తగిరి, జమ్మూ మగతానాయక్, చెన్నునాయక్, వెంకట్‌నాయక్, నగేశ్, బాబునాయక్, బాలునాయక్, శంకర్‌నాయక్, దీప్లానాయక్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని రామలక్ష్మీపురం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బెల్లంకొండ బ్రహ్మం తండ్రి వెంకయ్య (75) గురువారం అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎంపీపీ చింత కవితారెడ్డి నివాళులర్పించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అన్నెం అంజిరెడ్డి, మండల కార్యదర్శి శెట్టి సురేశ్‌నాయుడు, మండల యూత్ అధ్యక్షుడు అన్నెం వెంకట్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఉద్దండు, మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొప్పుల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి'

గరిడేపల్లి, జనవరి 9: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ కోరారు. గురువారం కోనాయిగూడెం గ్రామంలో దోసపాటి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్.. ఏడాదైనా రేషన్‌కార్డులు మంజూరు చేయలేదని, పింఛన్లు పెంచలేదని, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. మాజీ సర్పంచ్ హేమగాని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సుశీల, నాయకులు తుమ్మల సైదయ్య, దుగ్గి బ్రహ్మం, అర్జున్, దోసపాటి భిక్షం, యానాల సోమయ్య, శ్రీనివాస్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

అదనపు కోర్టుల మంజూరుకు కృషి చేయాలి

● జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్

జూనియర్ సివిల్ జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, జనవరి 9: హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో తొమ్మిది వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ కేసుల సత్వర పరిష్కారానికి అదనపు కోర్టుల మంజూరు కోసం కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ న్యాయవాదులకు సూచించారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు న్యాయవాదులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయస్థానంలో సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉందని, తగిన సిబ్బందిని కేటాయించే విధంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని అభ్యర్థించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాముల శివారెడ్డి, జక్కుల వీరయ్య, న్యాయవాదులు శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వర్‌రావు, బాల కృష్ణ, సత్యనారాయణ, రవికుమార్, యాదగిరి, అంజయ్య, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

● స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర బృందం సభ్యులు

సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

చివ్వెంల, జనవరి 9: ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీకి సిబ్బందికి అందజేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర బృందం సభ్యులు జయరాం, సెల్వరాజు, నజీమ్ సూచించారు. గురువారం మండలంలోని జి.తిరుమలగిరిలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ గురించి ఆరాతీశారు. డంపింగ్ యార్డును సందర్శించి తడి, పొడి చెత్తను వేరు చేయడం, చెత్త నుంచి సంపద సృష్టించడం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోశ్‌కుమార్‌తో పాటు ఎంపీఓ దయాకర్, ఏపీఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు కవిత, శ్రావణి, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎంపీడీఓ సునీత

నూతనకల్, జనవరి 9: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సునీత ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. కార్మికులతో వీధులను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూర్.ఎస్, జనవరి 9: మండల కేంద్రం ఆత్మకూర్.ఎస్‌లో పూర్వ విద్యార్థుల సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సహకారంతో హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి వైద్యులతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి హాజరైన ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశార